
సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం : 15 : మార్చి : 2023



నవధాన్యాలతో భూసారం పెంపు

నవధాన్యాల పంటతో భూసారం పెంచవచ్చు. నవధాన్యాల విత్తనాలను డ్వాక్రా మహిళల ద్వారా రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. -8లో ▸



పరీక్షల వేళ.. పాటిద్దాం ఇలా

పరీక్షల సమయంలో విద్యార్థికి ఆరోగ్యం ముఖ్యం. విద్యార్థులకు తేలికపాటి ఆహారం అందించడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. -8లో ▸

జేఈఈ, నీట్‌కు ఉచిత శిక్షణ



జేఈఈ, నీట్, ఈఏపీ సెట్‌లు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు తాడేపల్లిగూడెంలోని యువ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ ఉచిత క్లాసులు నిర్వహిస్తుంది. ఇందుకోసం డిజిటల్ క్లాసులు నిర్వహిస్తామని తెలిపింది. 8లో

న్యూస్‌రీల్

క్షీరారామలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు



క్షీరారామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం లెక్కించగా రూ.14,25,192 వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం హుండీలు లెక్కించగా 105 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, సభ్యులు రెల్లి నరసింహమూర్తి, పొత్తూరి పద్మ, నాగులకొండ రుక్మిణి, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

24న మాధవాయిపాలెం రేవు వేలంపాట



నరసాపురం-మాధవాయిపాలెం రేవు

నరసాపురం రూరల్: కీలకమైన నరసాపురం-మాధవాయిపాలెం రేవు పాటను ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. దీనికి సంబంధించి ఈనెల 14న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించనున్న ఈ రేవు పాటలో పాల్గొనదలిచే వారు మండల పరిషత్ కార్యాలయ పనిదినాల్లో రూ.2 వేలు చెల్లించి టెండరు షెడ్యూల్ దరఖాస్తు పొందవచ్చన్నారు. ప్రభుత్వ ప్రారంభ పాట ధర రూ.2,17,10,650గా నిర్ణయిస్తున్నామని, టెండర్ షెడ్యూల్ కొనుగోలు చేసేందుకు 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ మాత్రమే సమయం ఉందన్నారు. ధ్రువపత్రాలను 23 సాయంత్రం 5గంటల లోపు అందించాలన్నారు. సీల్డ్ టెండర్లతో కూడిన బహిరంగ వేలం పాటను 24వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మెరిట్ టెస్టులో టాపర్‌గా శ్రీకృష్ణ



విద్యార్థి శ్రీకృష్ణ వర్మను అభినందిస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ

కైకలూరు: ఎడ్యుకేషనల్ ఎపిఫినీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఆన్‌లైన్ ఈఈ మెరిట్ టెస్టులో కై కలూరు మండలం జంగంపాడు ఎంపీయూపీ స్కూల్ 7వ తరగతి విద్యార్థి పి.మిథున్ శ్రీకృష్ణ వర్మ ఏలూరు జిల్లాలో ప్రథమ స్థానం సాధించాడు. విజయవాడ బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన విజేతల అభినందన కార్యక్రమంలో ప్రశంసా పత్రం, షీల్డ్‌తో పాటు రూ.5000 నగదు బహుమతిని అందుకున్నాడు. ఈ నేపథ్యంలో దొడ్డిపట్ల హైస్కూల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ విద్యార్థి వర్మను అభినందించారు. ఎంఈవో డి.రామారావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో 22,000 వేల మంది విద్యార్థులు మెరిట్ టెస్టుకు హాజరయ్యారన్నారు. ఏలూరు జిల్లాలో 489 మంది పోటీ పడ్డారని చెప్పారు. వీరిలో శ్రీకృష్ణకు మొదటి స్థానం రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, ఎంపీడీవో రామలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్ది అంజన్నకు పూజలు



మద్ది క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తుల ద్వారా రూ: 1,07,474 ఆదాయం వచ్చిందని, వెయ్యి మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ చైర్మన్ కీసరి సరితా, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

మరింత రుచిగా, నాణ్యంగా..

- ప్రభుత్వాసుపత్రుల్లో బాలింతలు, రోగులకు భోజనం ఖర్చు పెంపు
- రూ.40 నుంచి రూ. 80కు పెంచిన ప్రభుత్వం
- పెరిగిన ధరల మేరకు టెండర్ల ఆహ్వానం



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో భోజనం సరఫరా చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకున్న బాలింతలు, ఇతర అనారోగ్యాలతో చికిత్స పొందుతున్న వారికి ఉచిత భోజనం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఇంతవరకూ రూ.40గా ఉన్న రోజువారీ ఖర్చును రూ.80 చేసింది. దీంతో ఇకపై ప్రభుత్వ ఆస్పత్రుల్లో బాలింతలు, రోగులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. బాలింతలు, రోగులకు ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం పెట్టేవారు. అందుకోసం ప్రభుత్వం రూ.40 చెల్లించేది. ఆ మొత్తం సరిపోవడం లేదని ప్రభుత్వానికి వినతుల నేపథ్యంలో భోజనం ఖర్చును పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

భోజనం సరఫరాకు టెండర్లకు ఆహ్వానం

పశ్చిమగోదావరి జిల్లాలోని 8 ప్రభుత్వ ఆస్పత్రులకు భోజనం సరఫరా చేసేందుకు ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. భోజనం ధర పెంచడంతో టెండర్లు వేసేందుకు పలువురు ఆసక్తి చూపించారు. జిల్లాలోని తణుకు జిల్లా ఆస్పత్రి, భీమవరం, నర్సాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రులతో పాటు, ఆచంట, ఆకివీడు, పెనుగొండ కమ్యూనిటీ ఆస్పత్రుల్లో ప్రతి రోజూ భోజనం అందిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 8 ప్రభుత్వ ఆస్పత్రులకు రోజుకు 730 మందికి భోజనం అందిస్తున్నారు. తణుకులో 200 మందికి, భీమవరం, నర్సాపురం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు ఆస్పత్రుల్లో 100 మంది చొప్పున, ఆచంట, పెనుగొండలో 50 మంది చొప్పున, ఆకివీడు ఆస్పత్రిలో 30 మందికి భోజనం అందిస్తున్నారు. మొత్తం జిల్లాలో రోజుకు 730 మందికి భోజనం అందిస్తున్నారు. 730 మందికి ఇంతవరకు నెలకు రూ.8,76,000 ఖర్చయ్యేది. రూ.40 పెంచడంతో నెలకు రూ.17,52,000 ఖర్చు చేయనున్నారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు జిల్లాలో మొత్తం 8 ప్రభుత్వాసుపత్రులు ఉన్నాయి. వాటిలో నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రులు కాగా, కై కలూరు, దెందులూరు, భీమడోలు, బుట్టాయగూడెం, పోలవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా ఉన్నాయి. ఈ ఆసుపత్రులకు సంబంధించి రోజుకు 600 మందికి భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. ఇంతవరకూ భోజనానికి రూ.40 చొప్పున నెలకు రూ.7.20 లక్షలు ఖర్చు చేస్తున్నారు. పెంచిన రూ.40తో కలిసి నెలకు రూ.14.40 లక్షలు ఇకపై ఖర్చు చేయనున్నారు.

ముగిసిన టెండర్ల ప్రక్రియ



జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బాలింతలు, రోగులకు భోజనం సరఫరా చేయడానికి ఈ నెల 1న ప్రకటన ఇచ్చాం. 7న టెండర్ల దరఖాస్తులు అందించాం. 13 వరకు టెండర్లను స్వీకరించాం. భీమవరం, తణుకు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం ఆస్పత్రులకు ఇద్దరు చొప్పున టెండర్లు వేశారు. నర్సాపురం, పెనుగొండ, ఆచంట ఆసుపత్రులకు ఒక్కొక్కరు చొప్పున టెండర్లు వేశారు.

– ఎం.వీరాస్వామి, డీసీహెచ్ఎస్

మెనూ ప్రకారం..

బాలింతలు, రోగులకు మెనూ ప్రకారం భోజనం, టిఫిన్ అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బాలింతలు, ఇతర పేషంట్లుకు ఒక మెనూ కాగా పిల్లలకు మరో మెను ప్రకారం భోజనం అందిస్తున్నారు.

బాలింతలు, ఇతర రోగులకు

- **టిఫిన్ :** ఇడ్లీ 150 గ్రాములు, పొంగలి లేదా కిచిడీ లేదా ఉప్మా 300 గ్రాములు, పాలు: 150 ఎంఎల్
- **భోజనం:** రైస్: 450 గ్రాములు, ఆకుకూర: 50 గ్రాములు, కర్రీ: 100 గ్రాములు, సాంబారు: 150 ఎంఎల్, గుడ్డు 1, పెరుగు: 100 ఎంఎల్, అరటి పండు 1

పిల్లల కోసం

- **టిఫిన్:** ఇడ్లీ 150 గ్రాములు, పొంగలి లేదా కిచిడీ లేదా ఉప్మా 300 గ్రాములు
- **పాలు:** 150 ఎంఎల్
- **భోజనం:** రైసు: 300 గ్రాములు, పప్పు: 50 గ్రాములు, కర్రీ: 200 గ్రాములు, సాంబారు: 150 ఎంఎల్, పెరుగు: 100 ఎంఎల్, పాలు: 500 ఎంఎల్, గుడ్డు: 1, పండు 1

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపుపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ పి.అరుణ్‌బాబు

ఏలూరు(మెట్రో): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమంపై అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఈనెల 16న ఉదయం 8 గంటలకు ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటరులో ప్రారంభమవుతుందన్నారు. ఓట్ల లెక్కింపునకు మొత్తం 5 టేబుల్స్ ఏర్పాటు చేశామని, కౌంటింగ్ సిబ్బందితో పాటు, ఆయా అభ్యర్థుల ఏజెంట్లు కూడా ఓట్ల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తారన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం పారదర్శకంగా వెబ్ కాస్టింగ్‌లో జరుగుతుందన్నారు. కౌంటింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సిబ్బంది 16వ తేదీ ఉదయం 7 గంటల కల్లా కౌంటింగ్ సెంటర్‌కు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సులకు సీళ్ల తీసే దగ్గర నుంచి ఓట్ల విభజన, లెక్కింపు ప్రక్రియ మొత్తం పారదర్శకమైన రీతిలో వీడియో చిత్రీకరణలో జరుగుతుందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువరించిన తరువాత కౌంటింగ్ సెంటర్ పరిసరాల ప్రాంతాలలో ఊరేగింపులు, విజయయాత్రలు నిషేధమన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ ఏవీఎస్ఎస్ మూర్తి, ఆర్డీఓ పెంచల్ కిషోర్, డీఆర్డీఏ పీడీ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలన
అమలు తీరు పరిశీలన



వీరవాసరంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వీరవాసరం: నులిపురుగుల నిర్మూలన మందును 1 నుంచి 19 ఏళ్ల ఉన్న ప్రతి ఒక్కరికీ అందించాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. వీరవాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీయూపీ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరు తనిఖీ చేశారు. నులి పురుగుల నిర్మూలన టాబ్లెట్లు ఎంత మందికి ఇచ్చారో అడిగి తెలుసుకున్నారు. ఈ మందుతో ప్రయోజనాలపై పిల్లలకు ప్రశ్నకు వేసి కలెక్టరు సమాధానం రాబట్టారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీల ద్వారా ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. వైద్య, విద్య, ఐసీడీఎస్ శాఖలు సమన్వయంతో పనిచేసి నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమం నూరు శాతం పూర్తి చేయాలన్నారు. అనారోగ్యంగా ఉన్న పిల్లలకు మాత్రలు వేయరాదని, నయమైన తర్వాత మాత్రమే ఇవ్వాలని స్పష్టం చేశారు. కలెక్టరు వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, ఐసీడీఎస్ అధికారి బి.సుజాతారాణి, తహసీల్దారు ఎం.సుందర రాజు, ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు, వైద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు మండలంలో..

పాలకోడేరు: నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నూరుశాతం పూర్తి చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం పాలకోడేరు మండలం శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని పరిశీలించారు. నులి పురుగుల నిర్మూలన టాబ్లెట్లు ఎంత మందికి ఇచ్చారు.. ఇంకా ఎంత మందికి ఇవ్వాలనే విషయాన్ని కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

రేపు ఐటీఐ అప్రెంటిస్ వర్క్‌షాప్

ఉండి: ఈ నెల 16న ఉదయం 10 గంటల నుంచి భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఐటీఐ అప్రెంటిస్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు మంగళవారం తెలిపారు. ఈ వర్క్‌షాపులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలు, ఒకేషనల్ కాలేజ్ ప్రతినిధులు తప్పక పాల్గొనాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అప్రెంటిస్ సంస్కరణలు తదితర విషయాలపై అవగాహనతో పాటు అనుమానాలు నివృత్తి చేస్తామన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 52 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ పి.ప్రశాంతి



భీమవరంలో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: జిల్లాలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 15న, పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3న ప్రారంభమవుతాయన్నారు. పరీక్ష హాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించకూడదని, ఇన్విజిలేటర్లు, పరీక్షా కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది కూడా స్మార్ట్ ఫోన్లు తీసుకురాకూడదన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయగా.. పరీక్షల నిర్వహణంతా సీసీటీవీలతో పర్యవేక్షణ చేస్తామన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాలలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. మొత్తం 35,787 మంది పరీక్షలు రాయాల్సివుందని, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో పాటు 955 మంది ఇన్విజిలేటర్లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. పదో తరగతి పరీక్షలకు 121 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి కె.కృష్ణవేణి, ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ పాల్గొన్నారు.

నిడమర్రులో 80 కాసుల బంగారం చోరీ

వృద్ధురాలిని కట్టేసి ఎత్తుకెళ్లిన దొంగలు



చోరీ వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

నిడమర్రు: ఇంట్లోని వృద్ధురాలిని బంధించి బీరువాలోని 80 కాసుల బంగారం చోరీ చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం నిడమర్రులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం కత్తుల జానకమ్మకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురు మరణించగా.. రెండో కూతురు కత్తుల గంగ గల్ఫ్‌లో ఉద్యోగం చేస్తూ తల్లి వద్ద బంగారం దాచుకుంది. జానకమ్మ చిన్న కూతురు పొట్ల జ్యోతితో నిడమర్రులో ఉంటుంది. మంగళవారం ఉదయం కూతురు జ్యోతి, అల్లుడు ప్రభాకర్ సఖినేటిపల్లి వెళ్లారు. విషయం తెలుసుకున్న ముగ్గురు వ్యక్తులు సాయంత్రం 4.30 సమయంలో జానకమ్మ వద్దకు వెళ్లి మీ అల్లుడు లోన్ కోసం బ్యాంక్‌కు అర్జీ పెట్టుకున్నాడని, విచారణకు వచ్చామని చెప్పారు. జానకమ్మను తాగేందుకు మంచినీళ్లు తీసుకురావాలని చెప్పడంతో వంటింట్లోకి వెళ్లింది. వెనుకనే ముగ్గురు వ్యక్తులు వెళ్లి జానకమ్మను కట్టేసి మంచంపై పడేశారు. అనంతరం రెండు బీరువాల్లో ఉన్న సుమారు 80 కాసుల బంగారు నగలు, వెండి వస్తువులు తీసుకుని పారిపోయారు. జానకమ్మ ఫిర్యాదు మేరకు సీఐ సుభాష్, ఇన్‌చార్జ్ ఎస్సై వెంకటేశ్వర రావు ఘటనా స్థలంలో వివరాలు సేకరించారు. పూర్తిగా తెలిసిన వారే చోరీ చేసినట్లు భావిస్తున్నారు.

ఎర్రకాలువ జలాశయానికి మహర్దశ

- ప్రాజెక్టు ఆధునికీకరణకు ఆదేశం
- రూ.75.80 కోట్లతో ప్రతిపాదనలు



జంగారెడ్డిగూడెం కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం



2018లో కొట్టుకుపోయిన ప్రధాన కాలువ రిటైనింగ్ వాల్

జంగారెడ్డిగూడెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటూ వారికి పెద్ద పీట వేస్తోంది. రైతుకు కావాల్సిన అన్ని రకాల సాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయడమే కాకుండా పాత ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టింది. ఇందులో భాగంగా జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఆధునికీకరణ పనులు అటుంచి కనీసం అవసరమైన మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఎర్రకాలువ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.28 టీఎంసీలుగా నిర్దేశించారు. ప్రాజెక్టు ఆక్రమణలకు గురికావడంతో 3.5 టీఎంసీలకు మించి నిల్వ చేయలేకపోతున్నారు. ఆధునికీకరణ పనుల మరమ్మతులకు తాజాగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. అనుమతులు రాగానే పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ. 75.80 కోట్లతో ప్రతిపాదనలు

కేకేఎం ఎర్రకాలువ ప్రాజెక్టు ఆధునికీకరణ, మరమ్మతులకు జలవనరుల శాఖాధికారులు రూ.75.80 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వీటిలో 2018లో తుఫాన్ వల్ల కొట్టుకుపోయిన ప్రధాన కాలువ రిటైనింగ్ వాల్, జనరేటర్లు, ఎర్త్‌డ్యామ్ పటిష్టం, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ఎర్త్ డ్యామ్ రోడ్ ఏర్పాటు, భవనాల ఆధునికీకరణకు ప్రతిపాదించారు.

ఉన్నతాధికారుల నుంచి సానుకూల స్పందన

ఎర్రకాలువ ప్రాజెక్టు ఆధునికీకరణ, మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అన్ని రకాల పనులు మరమ్మతులకు రూ. 75.80 కోట్లతో ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి నివేదించాం. జలవనరుల శాఖ ఉన్నతాధికారుల నుంచి సానుకూల స్పందన లభించింది. దీంతో త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన తరువాత వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– సీహెచ్ భాస్కరరావు, ఏఈ, కేకేఎం ఎర్రకాలువ జలాశయం

ప్రతిపాదనలు

- ఎర్త్‌డ్యామ్, స్పిల్‌వే బలోపేతం చేయడానికి రూ.60 కోట్లతో ప్రతిపాదించారు.
- ప్రాజెక్టు గేట్లు, సాంకేతిక పరికరాలు, మరమ్మతు పనులు, పునరుద్ధరణకు రూ. 43.20 లక్షలు
- 2018లో వరద తాకిడికి కొట్టుకుపోయిన ప్రధాన కాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 4.50 కోట్లు
- ప్రాజెక్టు ఎర్త్‌డ్యామ్‌కు లోపలి భాగంలో కాంక్రీట్ వేసేందుకు రూ. 4.21 కోట్లు
- ఎర్త్ డ్యామ్ మరమ్మతులకు రూ.1.39 కోట్లు
- ప్రాజెక్టుకు వరదల సమయంలో వరద ఉధృతిని ఎప్పటికప్పుడు తెలిపేందుకు రిమోట్ వాటర్ లెవల్ సెన్సార్‌లు అమర్చేందుకు రూ.50 లక్షలతో ప్రతిపాదించారు.
- డ్యామ్ చుట్టూ జంగిల్ క్లియరెన్స్, గ్రావెల్ ఫిల్లింగ్ తదితర పనులకు రూ. 27లక్షలు, డ్యామ్‌కు యాక్సెస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ.3 కోట్లు
- ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద ఉన్న భవనాల మరమ్మతులు, ఆధునీకరణకు రూ.5 లక్షలతో ప్రతిపాదనలు
- ప్రాజెక్టు వద్ద కంట్రోల్‌రూమ్ నిర్మాణానికి రూ.20 లక్షలు, ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ.30 లక్షలు డ్యామ్ పరిసర ప్రాంతంలో విద్యుదీకరణకు రూ.5 లక్షలు
- ప్రస్తుతం ఉన్న జనరేటర్‌కు అదనంగా స్టాండ్‌బైగా మరో 70 కేవీఏ జనరేటర్ ఏర్పాటుకు రూ.20 లక్షలు కేటాయించారు. అలాగే ఎర్రకాలువ ప్రాజెక్టు ఫోర్‌షోర్ ఏరియా ఆక్రమణలకు గురికావడంతో రీసర్వే చేసి ఆక్రమణలు తొలగించేందుకు రూ. 20 లక్షలతో అంచనా వేశారు. రిజర్వాయర్ ముంపు ప్రాంతం, భూమి సర్వే కోసం రూ. 50 లక్షలు వెచ్చించనున్నారు.

వెబ్‌సైట్‌లో ఎస్ఎస్‌సీ హాల్ టిక్కెట్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్ టిక్కెట్లను బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, రెసిడెన్షియల్, అన్ ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పైన తెలిపిన వెబ్‌సైట్ నుంచి పాఠశాల లాగిన్ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకుని వాటిని విధిగా అటెస్ట్ చేసి విద్యార్థులకు అందచేయాలని సూచించారు. ఎవరైనా విద్యార్థి హాల్ టిక్కెట్‌పై ఫొటో ముద్రితం కాకపోయినా, లేదా వేరొకరి ఫొటో తప్పుగా ముద్రితమైనా దానిపై సరైన ఫొటో అతికించి ప్రధానోపాధ్యాయులు అటెస్ట్ చేసి సంబంధిత పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు ఆ విద్యార్థిని పరీక్షకు అనుమతించాలని రాత పూర్వకంగా అభ్యర్థించాలని తెలిపారు. పరీక్షల ప్రక్రియ పూర్తయ్యేలోపు సదరు ప్రధానోపాధ్యాయులు పైన తెలిపిన వెబ్‌సైట్‌లో ఉన్న ఫొటో మార్పు కోసం ఉంచిన దరఖాస్తును పూర్తి చేసి ప్రభుత్వ పరీక్షల కార్యాలయ సంచాలకుడికి పంపాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు ఆర్టీసీ బస్సులు

భీమవరం (ప్రకాశం చౌక్): నేటి నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగినన్ని బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.వీరయ్య చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటలకే ప్రారంభం కానున్నందున ప్రస్తుతం ఉన్న షెడ్యూళ్లను మార్చి 7:45, 8 గంటల లోపు మండల కేంద్రాలకు చేరుకునేలా బస్సుల వేళలు మార్చామని చెప్పారు.

క్లుప్తంగా

గంజాయి తాగుతున్న ముగ్గురి అరెస్టు

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఉల్లంపర్రు పంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేట్ లే అవుట్ ఆవరణలో గంజాయి పీలుస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై కె.శ్రీనివాస్ మంగళవారం చెప్పారు. వీరికి గంజాయి ఎక్కడ నుంచి వచ్చింది, సరఫరా చేసిన వారు ఎవరు తదితర విషయాలను ఆరా తీస్తున్నామని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌లో నగదు పోగొట్టుకుని..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బెట్టింగ్‌లో నగదు పోగొట్టుకోవడంతో మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ విద్యార్థి విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని సుంకరవారి తోటకు చెందిన పిచ్చెట్టి భానుప్రసాద్ (21)నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల క్రికెట్ బెట్టింగ్‌లు ఆడి కొంత నగదు పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపం చెంది నాలుగు రోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన అతని కుటుంబ సభ్యులు వెంటనే అతనిని నగరంలోని ఆసుపత్రిలో చేర్పించారు. అయితే ఆరోగ్యం విషమించి మెరుగైన చికిత్సకోసం విజయవాడకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీనిపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవధాన్యాలు వేద్దాం.. పోషకాలు పడదాం

ఎరువులు, పురుగుమందుల వినియోగం లేకుండా జీరో కాస్ట్, ప్రకృతి విధానంలో సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోంది. ఈ విధానంలో నవధాన్యాలను పచ్చిరొట్ట తరహాలో భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరిగి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించవచ్చు. అంతేకాక నవధాన్యాల విత్తనాలను డ్వాక్రా గ్రూపు మహిళల ద్వారా రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీని వల్ల క్షేత్రస్థాయిలో సాగు విస్తరణ పెరగడంతో పాటు డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడనుంది.

- పచ్చిరొట్టగా పెంచి చేనులో కలియదున్నడంతో భూసారం పెంపు
- ఎరువుల వినియోగ రహిత ప్రకృతి వ్యవసాయమే లక్ష్యం
- డ్వాక్రా మహిళలకు ప్రోత్సాహకంగా విత్తనాల విక్రయ బాధ్యతలు
- 20 నుంచి ఆర్‌బీకేల్లో అందుబాటులో నవధాన్యాల కిట్లు



చినతాడేపల్లిలో పరిమి శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రంలో ఏపుగా ఎదిగిన నవధాన్యాల పచ్చిరొట్ట



అలంపురంలోని శ్యామల డ్వాక్రా గ్రూపు మహిళలకు రుణం అందిస్తున్న అధికారులు (ఫైల్)



పచ్చిరొట్ట ఎరువును దుక్కిలో దున్నుతున్న దృశ్యం (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: ప్రకృతి విధానం సాగులో రైతులు తాము పండించిన పంట వారం రోజుల్లో కోతకు వస్తుందనగా నవధాన్యాలు (33 రకాల ధాన్యాలు) విత్తనాలను చల్లుకోవాలి. వారం రోజుల్లో విత్తనాలు మొక్క దశకు చేరుకుంటాయి. 35 నుంచి 40 రోజులలో పూర్తి స్థాయిలో ఎదుగుతాయి. వీటిల్లోనే పశువులను మేపుకోగా, మిగిలిన దానిని దుక్కిలో దున్ని వారం రోజుల పాటు ఉంచుతారు. ఇలా చేయడం వల్ల 50 శాతానికి పైగా పోషకాలు భూమికి అందుతాయి. దీని వల్ల ఎరువులు, పురుగు మందులు వినియోగం 50 శాతానికి పైగా తగ్గుతుంది. ఇలా చేయడం వల్ల పంటకు చీడపీడలు కూడా ఆశించవు. పంట కూడా ఆరోగ్యకరంగా పెరుగుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా తయారీ

తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా నవధాన్యాల ప్యాకెట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. 11 కిలోల ప్యాకెట్‌ను రూ.వెయ్యికి విక్రయిస్తున్నారు. ఇలా తయారు చేసేందుకు ఈ గ్రూపులకు బ్యాంకు లింకేజ్ ద్వారా రుణ సదుపాయాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఒక్కో గ్రూపుకు రూ.50 వేలు అందిస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలంలో ఐదు, పెంటపాడు మండలంలో ఆరు గ్రూపులకు రుణ సదుపాయం కల్పించారు. ప్యాకింగ్ ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు కొంత ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఇది వారి కుటుంబ అవసరాలకు ఉపకరించనున్నది. తాడేపల్లిగూడెం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 650 ఎకరాల్లో ఇలా నవధాన్యాలను వేసి, జీరో కాస్ట్ అగ్రికల్చర్ విధానాన్ని అవలంబిస్తున్నారు.

క్షేత్రసాయిలో విస్తరణకు కృషి

ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న జీరో కాస్ట్ అగ్రికల్చర్ విధానాన్ని త్వరలోనే ఆర్‌బీకేల పరిధిలోకి తీసుకురానున్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులు తయారు చేసిన నవధాన్యాల విత్తనాల ప్యాకెట్లను ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతి (పీఎండీఎస్) పథకం కింద ఆర్‌బీకేల ద్వారా రైతులకు విక్రయిస్తారు. తద్వారా ప్రకృతి సాగును క్షేత్ర స్థాయిలో విస్తరిస్తారు.

ఇంటింటికీ వెళ్లి అవగాహన

నవధాన్యాలను దుక్కిలో వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన గడపగడపకు నవధాన్యాలు సారథులు అవగాహన కల్పిస్తారు. గ్రామంలోని సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు సేకరించి ఆయా రైతుల ఇళ్లకు వెళ్లి వివరిస్తారు. ఏపీ సీడ్స్, నూజివీడు, ఏలూరు, తణుకు ప్రాంతాల్లో రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం నవధాన్యాలు విత్తనాలను సేకరిస్తుంది. ఇలా సేకరించిన విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసి, రైతులకు సరఫరా చేస్తుంది. ఇప్పటికే వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ విభాగాలు ప్రయోజనాలపై క్షేత్ర స్థాయిలో పరిశోధనలు నిర్వహించింది. మంచి ఫలితాలనివ్వడంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తారు.

ప్రకృతి సాగుతో పాటు ఆర్థిక పరిపుష్టి



నవధాన్యాల విత్తనాల ప్యాకెట్లను విక్రయించ డం ద్వారా ప్రకృతి సాగు ను ప్రోత్సహించడంతో పాటు సంఘ సభ్యులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు. ఏడాది పొడవునా ఈ ప్రక్రియ సాగుతుండటంతో గ్రూపు మహిళలకు ఉపాధి లభిస్తుంది.

– మంగం కనకమహాలక్ష్మి, శ్యామల గ్రూపు, అలంపురం, పెంటపాడు మండలం

ఇంటి నుంచే ఉపాధి

బయటకు వెళ్లి పనిచేయాల్సిన అవసరం లేకుండా ఇంటి పట్టునే ఉండి చేసే పని. ప్రభుత్వం సైతం రుణ సదుపాయం కల్పించడంతో ప్రోత్సాహకరంగా ఉంది. ఆర్‌బీకేలకు ఈ ప్యాకెట్లు సరఫరా చేయడం ద్వారా మరింతగా ఆర్థిక పరిపుష్టి కలుగుతుంది.

– శీలి కాంతం, క్రాంతి ఎస్‌హెచ్‌జీ గ్రూపు, చినతాడేపల్లి, తాడేపల్లిగూడెం మండలం

భావితరాల ఆరోగ్యం కాపాడవచ్చు



జీరో కాస్ట్ అగ్రికల్చర్ విధానాన్ని అవలంబించడం ద్వారా భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. దీనివల్ల సాగులో ఖర్చులు సైతం తగ్గుతాయి. భావితరాల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు. ఈ నెల 20 నుంచి కిట్లు అందుబాటులో ఉంటాయి.

– గుమ్మళ్ల వీర్రాజు, ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జి, తాడేపల్లిగూడెం

తెలంగాణ మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు



కొవ్వలిలో నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో తెలంగాణ మద్యం 137 బాటిళ్లను అక్రమంగా కలిగి ఉన్న గ్రామానికి చెందిన గొల్ల వినయ్‌ను అరెస్టు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ టీ.సుబ్బిరెడ్డి చెప్పారు. గ్రామం నుంచి తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించగా గొల్ల వినయ్ వద్ద తెలంగాణకు చెందిన మద్యం బాటిళ్లు దొరికాయన్నారు. దీంతో నిందితుడు గొల్ల వినయ్‌ని అరెస్టు చేసి, బైక్‌ను సీజ్ చేసి చేసినట్లు వారు వివరించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తణుకు: భార్యపై కోపంతో మనస్తాపం చెంది ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన దేవాబత్తుల రాజు అలియాస్ దావీదు (35) స్థానిక ఇరగవరం రోడ్డు కాలనీకు చెందిన పద్మను ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఇటీవల నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి భార్యపై కోపంతో ఇరగవరం రోడ్డు కాలనీలోని మల్లికాసుల పేటలోని పార్కు గోడ ఇనుప గ్రిల్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి దేవాబత్తుల మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముత్యాల సత్యనారాయణ తెలిపారు.

తల్లిపై కుమారుడి కుటుంబం దాడి

భీమవరం అర్బన్: కౌలు సొమ్ము ఇవ్వాలని కోరిన ఓ తల్లిని ఆమె కుమారుడి కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరిచారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్‌వీఎన్ పురం గ్రామానికి చెందిన మల్లాడి పెద్దింట్లమ్మకు కొంత వ్యవసాయ భూమి ఉంది. దీనిని కుమారుడు మల్లాడి వీరాస్వామికి కౌలు కింద చేసుకోవడానికి ఇచ్చింది. అయితే కౌలు సొమ్ము ఇవ్వమని అడగగా కుమారుడు వీరాస్వామి, మనవడు గోవింద్, కోడలు ఆదిలక్ష్మి కొట్టి గాయపరిచారని పెద్దింట్లమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహన్‌రావు చెప్పారు.

విద్యార్థులను పరిశోధనల వైపు నడిపించాలి



నిట్ సందర్శనలో వాసవీ ఇంజనీరింగ్ ఆచార్యులు

తాడేపల్లిగూడెం: విద్యార్థులను పరిశోధనలవైపు నడిపించాల్సిన బాధ్యత ఆచార్యులపై ఉందని నిట్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్ అన్నారు. మంగళవారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు 25 మంది నిట్‌ను సందర్శించారు. సందీప్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞాన రంగాల్లో భారతదేశం పురోభివృద్ధి సాధించాలంటే కళాశాల స్థాయి నుంచే విద్యార్థులను నాణ్యమైన పరిశోధనల వైపు నడిపించాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆచార్యులు బోధనకే పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఎప్పటికప్పుడు సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు, కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చైన్ వంటి అత్యాధునిక సాంకేతికతలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అంకుర పరిశ్రమలను ఏర్పాటు చేసి, నవకల్పనకు బాటలు వేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. పవర్ ఎలక్ట్రానిక్స్, పవర్ సిస్టం, సర్క్యూట్, ఎలక్ట్రికల్ మెజర్‌మెంట్ ప్రయోగశాలలతో పాటు కామన్ రీసెర్చ్ టెక్నాలజీ డెవలప్‌మెంటు హబ్‌ను పరిశీలనకు వచ్చిన ఆచార్యులకు చూపించారు. ప్రయోగశాల ఇన్‌చార్జి డాక్టర్ టి.రమేష్, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ శ్రీఫణికృష్ణ కర్రి విషయాలను వివరించారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాల డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సీహెచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల వేళ.. పాటిద్దాం ఇలా



పరీక్షల కోసం విద్యార్థులకు స్టడీ క్యాంప్ నిర్వహిస్తున్న దృశ్యం,

డా కిరణ్ చైతన్య, వైద్యాధికారి, రాఘవాపురం పీహెచ్‌సీ

చింతలపూడి: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పదో తరగతి పరీక్షల తేదీ కూడా తరుముకొస్తోంది. ఈ నేపథ్యంలో పరీక్షల వేళ విద్యార్థులు చదువుపై ధ్యాసతో ఆహార, పానీయాలు సరైన సమయంలో తీసుకోవడం మర్చిపోతారు. గంపెడు సిలబస్‌ను ఔపోసన పట్టి పరీక్ష రాయాలంటే ముందుగా విద్యార్థికి ఆరోగ్యం అవసరం. ఇందుకు తల్లిదండ్రులు చేయాల్సిందేంటంటే పరీక్షలకు సిద్ధమయ్యే వేళల్లో విద్యార్థులకు తేలికపాటి ఆహారం అందించడం ఉత్తమమని రాఘవాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ చైతన్య సూచిస్తున్నారు. రోజూ ఇళ్లల్లో వండే వంటల్లోనే చిన్న, చిన్న మార్పులు చేసి తేలికపాటి ఆహారాన్ని వండి పెట్టాలని తల్లులకు సూచిస్తున్నారు.

ఇలా చేద్దాం

- అధిక కారం, మసాలా, నూనెలతో తయారైన ఆహార పదార్థాలకు దూరంగా ఉండండి
- ప్రతి రోజూ కనీసం 6 నుంచి 8 గంటలు నిద్ర పోవడం మంచిది. తేలికగా జీర్ణమయ్యే ఇడ్లీ, రసంతో భోజనం మంచిది. పెరుగు, మజ్జిగ పరిమితంగా తీసుకోవాలి.
- అందుబాటులో ఉండే తాజా పండ్లు తీసుకోవాలి. ద్రాక్ష, అరటి పండు, అనాస, దోస వంటి పండ్లు ఆరోగ్యానికి మంచిది. పరీక్షలు జరిగే రోజుల్లో మాంసాహారానికి దూరంగా ఉంటే మంచిది. మంచి ఆహారంతో పరీక్షల గండం గట్టెక్కినట్లే.

టైంటేబుల్ ఇలా ఉంటే బెటర్

- పరీక్షల సమయంలో విద్యార్థులు ఉదయం 4.30 గంటలకు లేవడం, రాత్రి 10.30 గంటలకు నిద్రించడం అలవాటు చేసుకోవాలి.
- మెదడు చురుగ్గా పనిచేయడానికి ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా చిక్కుడు, కూరగాయలు, పండ్లు తినాలి. ఉదయం లేచిన వెంటనే కొద్దిసేపు వ్యాయామం చేస్తే మంచిది. తరువాత ఇడ్లీ, పాలు తీసుకోవడం ఉత్తమం. అనంతరం చదువు ప్రారంభించాలి.
- పరీక్ష రాసి ఇంటికి వచ్చాక పండ్లు, పండ్ల రసాలు తాగాలి. పెరుగుతో ఆహారం భుజించడం కూడా మంచిదే. సాయంత్రం చదువు ప్రారంభించేటప్పుడు కప్పు టీ తాగాలి. చదవడం అయిపోయాక నిద్రకు ఉపక్రమించే గంట ముందు తేలికపాటి భోజనం తీసుకోవాలి.
- ఒత్తిడికి లేకుండా నిద్రించాలి. ఎక్కువ సార్లు పాలు తాగితే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఒకసారి రాస్తూ చదివితే పదిసార్లు చదివినట్లే. విద్యార్థులూ.. ఇంకెందుకు ఆలస్యం ఈ చిట్కాలను పాటించి పరీక్షల్లో విజయాన్ని పొందండి.

జేఈఈ, నీట్, ఈఏప్ సెట్‌లకు ఉచిత శిక్షణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): జేఈఈ, నీట్, ఈఏప్ సెట్‌లకు ఉచిత క్లాసులు ఏప్రిల్ 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు యువ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ గౌరవాధ్యక్షులు, లెక్కల అధ్యాపకులు పులుగు దీపక్ (విజయవాడ) పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్కూల్స్, కళాశాలలో డిజిటల్ క్లాస్‌లను ఉపయోగించుకుంటూ శిక్షణ ఇస్తామన్నారు. డిజిటల్ క్లాసులు అందుబాటులో లేనివారికి సెల్‌ఫోన్ల ద్వారా క్లాసులు ఉంటాయన్నారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులు, లెక్కలు సబ్జెక్టులలో యూ ట్యూబ్ చానల్, జూమ్ యాప్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. ఉచిత శిక్షణకు హాజరయ్యేవారు 77801 50751 నంబర్‌కు కాల్ చేసి ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. స్టడీ గ్రో యాప్ ద్వారా జేఈఈ, నీట్, ఈఏప్‌సెట్‌లకు మెటీరియల్స్ అందించి పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు.

క్లుప్తంగా

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ రమణ

అత్తిలి: జగనన్న లేఅవుట్‌ల్లో గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని హౌసింగ్ ఈఈ బీవీ రమణ చెప్పారు. అత్తిలి శివారు బొంతువారిపాలెంలో జగనన్న లేఅవుట్‌ల్లో నిర్మిస్తున్న గృహాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కాలనీలో ఫోమ్ కాంక్రీట్ టెక్నాలజీతో కడుతున్న గృహాలను సందర్శించి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, ఇన్‌ఛార్జ్ హౌసింగ్ ఏఈ టి శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు గూడెంలో శిలువ ప్రభావ వెల్లువ

పెంటపాడు: క్రీస్తు శ్రమదినాలు పురస్కరించుకొని ప్రత్యేకంగా బైబిల్ మిషన్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈనెల 15న క్రీస్తు శిలువ ప్రభావ వెల్లువ కార్యక్రమం గూడెం పోలీస్ ఐలండ్ సెంటర్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ సభ్యుడు పి. ప్రవీణ్ ఒనేసిం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించబోయే ఈ సమావేశానికి గుంటూరుకు చెందిన డాక్టర్ జె. శామ్యేల్‌కిరణ్‌తో పాటు, మిషన్ ఉన్నతాధికారులు, పాలకవర్గ సభ్యులు హాజరవుతారన్నారు. పరిసర గ్రామాల విశ్వాసులు పాల్గొనాలని ఈ సందర్భంగా ప్రవీణ్ ఒనేసిం కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎం. డేవిడ్‌పాల్, పి. ఏసుదానం, బి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్ల్ మార్క్స్ వర్ధంతి



మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేసిన మహా నీయుడు కార్లమార్క్స్ అని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు కొనియాడారు. మార్క్స్ 140వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉల్లిపాయమార్కెట్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మార్క్స్ వర్ధంతి సభ జరిగింది. మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ మార్క్స్ జీవిత విశేషాలను వెల్లడించారు. మార్క్స్ ఆశయ సాధనకు కార్మికులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకర నాగేశ్వరరావు, చల్లా చంద్రరావు, కరక వెంకట్రావు, ఎస్.గణేష్, జి.శ్రీను, రమేష్, వంశీ, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాల వద్ద రోడ్డు మరమ్మతులు చేయండి

పాలకోడేరు : నరసాపురం- భీమవరం బ్రాంచ్ లైన్‌లో శృంగవృక్షం రైల్వే గేటు వద్ద పట్టాల మధ్యలో రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామాభివృద్ధి కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. పట్టాల మధ్యలో రోడ్డు గుంతలు పడటం వల్ల ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిటీ ఫిర్యాదులో పేర్కొంది. అలాగే ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద గల రైల్వే గేటు, కుముదవల్లి రైల్వే గేటువద్ద కూడా పట్టాల మధ్యలో రోడ్లు గుంతలు పడ్డాయని, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గులిపల్లి సత్యనారాయణ, సోము రామకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆశాజనకంగా రబీ సాగు



స్థానిక ఆర్బీకే పరిధిలోని వరి పొలాల్ని సందర్శించిన కేవీకే శాస్త్రవేత్తలు

ఆకివీడు : రబీ సాగు ఆశాజనకంగా ఉందని కేవీకే శాస్త్రవేత్తలు వినయలక్ష్మి, రాజేష్ చెప్పారు. మండలంలోని మాదివాడ, ఆకివీడు ప్రాంతాల్లోని వరి సాగును మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడక్కడా కాండం కుళ్లు తెగులు ఉందని గుర్తించారు. డెల్టా శివారు, కొల్లేరు తీరంలోని ఉన్న గ్రామాల్లో వరి పొట్ట, ఈనిక దశలో ఉందన్నారు. తెగుళ్ల ప్రభావంకు పంట దూరంగా ఉందని చెప్పారు. ఏడీఏ కేఏఎస్ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు టెబుకొనజోల్ 2 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక, వీఏఏ సతీష్, నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలన.. ఆరోగ్యానికి ఆలంబన

- జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



అత్తిలి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న ఎంఈవో శారదాజ్యోత్స్న



దువ్వలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం గురించి చిన్నారులకు వివరిస్తున్న సర్పంచ్ అడ్డా బాబు



ఇరగవరం పీహెచ్‌సీ వద్ద నులి పురుగుల నివారణ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది



తాడేపల్లిగూడెం మండలం మాధవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డాక్టర్ శైలజ



భవిత సెంటర్‌లో నులి పురుగుల నివారణ మందులు దివ్యాంగులకు పంపిణీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: కంటికి కనిపించని శత్రువు నులిపురుగు అని మండల విద్యాశాఖాధికారి డి.శారదాజ్యోత్స్న చెప్పారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆరోగ్య, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అత్తిలి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులి పురుగుల నివారించి, మంచి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి, గుబ్బల విజయవాణి తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్‌లో : చిన్న పిల్లల్లో నులిపురుగుల నివారణ ద్వారానే వారి సంపూర్ణ ఆరోగ్యం ఏర్పడుతుందని దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా సూర్యనారాయణ మూర్తి (అడ్డా బాబు) చెప్పారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దువ్వ గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మందు బిల్లలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు బీ దుర్గా కుమారి, హెచ్ఎం శ్రీలక్ష్మి, ఎంపీహెచ్ఏ ఎంపీ వెంకట్రావు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, నళిని, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తణుకు మున్సిపాలిటీ పరిధిలోని వీరభద్రపురం, వెంకట్రాయపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తణుకు మలేరియా సబ్ యూనిట్ అధికారి జీ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వం అందజేస్తున్న అల్బెండజోల్ మాత్రల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్, పీ సునీత, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఇరగవరంలో: మండలంలోని ఇరగవరం, రేలంగి పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీల వైద్యులు బంగారు రవి, వెలగల లక్ష్మీ క్రాంతి మాట్లాడుతూ కడుపునొప్పి, రక్త హీనత, బుద్ధిమాంద్యం, సోమరితనం వంటి వ్యాధులను దరికి చేరనివ్వకుండా ఈ అల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఈ మాత్రలు వేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ మోహన్, వైద్యులు సాయి గిరి రెడ్డి , ఎంపీహెచ్‌వో జి ప్రసాద్, సీహెచ్‌వో రామారాజు, అధికారులు, నాయకులు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు , అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్‌లో: మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 35 పాఠశాలలు, కాలేజీ, హాస్టల్స్, 38 అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి శైలజ ఆధ్వర్యంలో 6045 మంది పిల్లలకు గాను తొలి రోజు 5820 మందికి మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో పి.కృపావరం, ఎంపీహెచ్ఎస్ రామకృష్ణ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ)లో: జాతీయ నులి పురుగల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని భవిత దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగుల విద్యార్థులకు నులి పురుగు నివారణ మందులు అందజేశారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, మాట్లాడుతూ నులిపురుగు మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వెల్లడించారు. ప్రతి ఒక్కరికి మాత్రలు అందించాలని సూచించారు.

అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



నూతనంగా ఎన్నికైన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ఇఫ్టూ జిల్లా నాయకులు మామిడి దాన వర ప్రసాద్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పామర్తి సత్యనారాయణలు కోరారు. యూనియన్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం పట్టణంలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, 58 సంవత్సరాలకే పింఛన్ సదుపాయం అమలు చేయాలని తెలిపారు. ఈ రంగంలో పని చేస్తున్న కార్మికులకు సబ్సిడీతో కూడిన రుణాలు, వృత్తి కిట్లు అందించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నిక చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా మామిడి దాన వర ప్రసాద్, కనకదుర్గ వెంకటేశ్వరరావులు, అధ్యక్షుడిగా బండి దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మేక ఆదినారయణ, జనరల్ సెక్రటరీగా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా శివశంకర్, కోశాధికారిగా దేవాభక్తుల రాంబాబు, కమిటీ సభ్యులుగా పాండురంగారావు, గంగాధర్, అప్పన్న, వరణ్, వెంకట రమణలను ఎన్నికయ్యారు.

ఇంటి నిర్మాణాలను వేగిరపర్చాలి



జగన్నాథపురం ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడతున్న తహసీల్దార్ వైకేవీ.అప్పారావు

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న ఇంటి నిర్మాణాలను వేగిరపర్చాలని తహసీల్దార్ వైకేవీ.అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలో జగన్నాథపురం రైతు భరోసా కేంద్రంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌లో ఇప్పటి వరకు ఇంటి నిర్మాణాలు చేపట్టని 64మంది లబ్ధిదారులు త్వరితగతిన పనులు ప్రారంభించాలన్నారు. ప్రతి లబ్ధిదారునితో మాట్లాడి ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వి.ఎస్.వేణుగోపాల్, హౌసింగ్ డీఈ కేవీవీఎస్. ప్రసాద్, ఏఈ వైవి.వెంకట్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్‌కె. నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సాక్షం ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రతి ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని సాక్షం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సాక్షం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తీసుకుంటున్న రుణాలు, వాటి చెల్లింపులు, బీమా వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ఆర్‌డి.వర ప్రసాద్, సీసీలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పరిరక్షణకు పోరాటాలే మార్గం



అర్జునుడు పాలెంలో ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఇరగవరం: ఉపాధి హామీ పరిరక్షణకు పోరాటలే మార్గమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. మంగళవారం మండలంలోని అర్జునుడు పాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కూలీ రూ. 257లు ప్రస్తుత ధరలతో పోలిస్తే చాలా తక్కువ అని పాత పద్ధతిలోనే కొలతల ప్రకారం పని చేయించి పోస్టాఫీస్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే కూలీలకు రూ. 600లు కూలీ వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్రీ వీర రాఘవ రెడ్డి, పాలకోటి వెంకట లక్ష్మి, జుత్తిగ లక్ష్మి, జుత్తిగ దుర్గామ్మ, పాల విజయలక్ష్మి, కుక్కల పార్వతీ, జుత్తిగ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

ఉండి : ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు పి.నరసింగరావు, కన్నెగంటి రూత్‌కళ, హరనాథరాజు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి రంగప్రసాద్‌రాజు, హెచ్ఎం ఎంవీ సత్యనారాయణ, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

25న ఎస్ఆర్‌కేఆర్‌లో స్ఫూర్తి జాతీయస్థాయి సింపోజియం



జాతీయ సింపోజియం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 25వ తేదీన 'స్ఫూర్తి 23' జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు చెప్పారు. మంగళవారం కళాశాలలో సింపోజియం పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎస్ఈ హెడ్ వి.చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. స్ఫూర్తి సింపోజియంకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. దీనిలో భాగంగా ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు అప్లికేషన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 23వ తేదీన 24 గంటల పాటు నిర్విరామంగా హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సాగి సత్యప్రతీక్‌వర్మ, ప్రియదర్శిని, పి భరత్ శివవర్మ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

ఉండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలపై ప్రత్యేక దృష్టిసారించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. మంగళవారం ఉండిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ నియమించి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో యాగం



వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని హౌసింగ్ బోర్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మందిరంలో నిర్వహిస్తున్న శ్రీవారి అష్టబంధన సంప్రోక్షణ మహోత్సవ యాగం వేదోక్తంగా ప్రారంభమయ్యింది. అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో యావని రామచంద్ర సోమయాజి ఘనాపాటి వేదోక్త మంగళశాసనంతో వైభవంగా నిర్వహించారు. మంగళవారం దీక్షాధారణ, అగ్నిప్రతిష్ట, సాయంత్రం సకల హోమాలు నిర్వహించారు. కొత్తపల్లి కోదండ రామ గాంధీరాజు – హైమావతి దంపతులు పీటలపై కూర్చుని పూజాధికాలు చేశారు. 20 మంది అర్చకులకు దీక్షాదారణ, ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు దీక్షా వస్త్రాలు అందించారు. ఉదయం 4 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు లోకశాంతి కోసం ఈ యాగం నిర్వహించారు. ఈనెల 18వ తేదీ వరకు యాగం నిర్వహిస్తామని ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు, కుక్కల బాల తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి తాడికొండ కోటేశ్వరరావు గుప్త, ఉపాధ్యక్షుడు సరిపిడకల రామారావు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, జానపాటి మధుసూదనరావు, కడలి వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

హెల్మెట్ లేదా.. వాహనం కదలదు

- హెల్మెట్ ధారణ తప్పనిసరి
- పోలీసులు ఇక నుంచి హెల్మెట్ లేనివారిపై చర్యలు



హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న గూడెం రూరల్ సీఐ ఎస్వీఎస్ మూర్తి

పెంటపాడు: జిల్లాలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు అధికం కావడంతో ఈ ప్రమాదాలు మరిన్ని జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల వల్ల చాలా మంది ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు. ఇందులో అత్యధికంగా యువత ఎక్కువగా చనిపోతున్నారు. ఈ రోడ్డు ప్రమాదాల సరళిని గమనిస్తే చాలామంది ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించడం లేదు. మృతులందరూ ఈ తరహా కోవలోకి వస్తున్నారని పోలీసులు కూడా గుర్తించారు. 80 శాతం ప్రమాదాల్లో తలకు గాయాల వల్లే ఎక్కువ మంది మరణిస్తున్నారు. ఈ మరణాలకు అడ్డుకట్ట వేయాలంటే హెల్మెట్ ధరించడం ఒక్కటే పరిష్కారం. ఇప్పటికే జాతీయ రహదారి భద్రత పరిసంస్థ ఈ విషయాన్ని స్పష్టంగా తెలిపింది. దీనిని వాహన చోదకులు సీరియస్‌గా పరిగణించడంలేదు. ఇటీవల వరుస ప్రమాదాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ రవిప్రకాష్ ఈ అంశం పై ఫోకస్ పెట్టారు. ఈ నెల నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ ఆయన ఆదేశాలు ఇప్పటికే జారీ చేశారు. ఈ నిబంధన అమలు చేసేందుకు పోలీసులు సన్నద్ధమయ్యారు.

శిక్ష ఇలా.....

హెల్మెట్ ధరించనివారిని అపి జరిమానా వేయడం పాత విధానం. ఇకపై అలా వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే వాహనాన్ని పోలీసులు తమ అధీనంలోకి తీసు కొంటారు. హెల్మెట్ కొనుగోలు చేసి ధరించే లా ప్రోత్సహిస్తారు. హెల్మెట్ కొనుగోలు చేసి తీసుకొచ్చిన తరువాత తమ వాహనాన్ని తిరిగి ఇస్తారు.

మన భద్రతకే అని గ్రహించాలి



హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రమాదంలో పడితే కుటుంబ సభ్యుల పరిస్థితి గురించి వాహన చోదకులు తప్పక ఆలోచించాలి. మన నిర్లక్ష్యం కుటుంబానికి శిక్ష కాకూడదు. ప్రమాదాల నివారణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరి చేశాయి. ఇక నుంచి హెల్మెట్ ధరించకపోతే చర్యలు తప్పవు.

– జి. సత్యనారాయణ, ఎస్సై, పెంటపాడు

హెల్మెట్ వాడకం వల్ల సత్ఫలితాలు



జిల్లా ఎస్పీ రవిప్రకాష్, డీఎస్పీ శ్రీనాథ్‌ల ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఫిబ్రవరి నెలలో రెండు పోలీస్‌స్టేషన్‌ల్లో ఐదు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు చనిపోయారు. ప్రత్యేక డ్రైవ్ వల్ల మార్చినెలలో వాహనదారులు హెల్మెట్‌ల వాడకం ప్రారంభిస్తున్నారు. సత్ఫలితాలు వస్తున్నాయి. అందరూ ఆచరిస్తే ప్రమాదాల సంఖ్య తగ్గించవచ్చు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుంది.

– ఎస్వీవీఎస్ మూర్తి, తాడేపల్లిగూడెం రూరల్ సీఐ